జగన్ పాలనలో గడప గడపకు మేలు



బందరులో అభివృద్ధి పనుల వివరాల బోర్డును ఆవిష్కరించిన పేర్ని కిట్టు



పోసినవారిపాలెంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన నాయకులు

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపకు మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 23, 44, 45 డివిజన్లలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయా డివిజన్లలో ఏర్పాటు చేసిన సమావేశాలకు హాజరైన పేర్ని కిట్టు మాట్లాడుతూ గత ఎన్నికల ముందు పాదయాత్రలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గత పాలనలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పలు సాహసోపేత నిర్ణయాలతో పేద ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. అన్నివర్గాల ప్రజలను ఆదుకునేందుకు నవరత్న పథకాలతో పాటు పలు సంక్షేమ పథకాలను మునుపెన్నడూ లేని విధంగా అమలు చేస్తున్నారన్నారు. సీఎం జగన్ పాలన దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. సీఎం జగన్ వల్ల లబ్ధిపొందిన ప్రతి కుటుంబం మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిని చేసేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో పార్టీ జెండాను, ఆయా డివిజన్ల అభివృద్ధి పనుల వివరాలతో కూడిన బోర్డులను మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు నరహరిశెట్టి రోజా, ఆకుల వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, కాగిత జవహర్‌లాల్, కార్పొరేటర్లు మిరియాల బసవపూర్ణమ్మ, శ్రీరాం చిన్నా, పల్లి సింహాచలం, కో–ఆప్షన్ సభ్యులు మట్టా తులసి, బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్, మామిడిబత్తుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోసినవారిపాలెంలో..

గూడూరు: మండల పరిధి పోసినవారిపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును, గ్రామంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలులను వివరించారు. సంక్షేమ పథకాల అమలుతో అన్నివర్గాల ప్రజలను ఆదుకున్నారని చెప్పారు. జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే జగనన్నను మళ్లీ సీఎంను చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్లం పెదబాబు, సర్పంచి పిండి రమాదేవి, పెడన మార్కెట్ యార్డు డైరెక్టర్ చండిక పరశురామయ్య, పిండి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

95,970 హెక్టార్లలో వరి పంటకు నష్టం

ప్రాథమిక అంచనాలను సీఎస్‌కు వివరించిన కృష్ణా జిల్లా జేసీ



వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరైన జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): మిచాంగ్ తుపాను కారణంగా జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు రూపొందించిన ప్రాథమిక అంచనాల ప్రకారం 95,970 హెక్టార్లలో వరిపంట నష్టం జరిగినట్లు కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో వ్యవసాయం, గృహనిర్మాణం, ప్రభుత్వ ప్రాధాన్యం భవనాల పురోగతిపై సమీక్షించారు. జేసీ అపరాజిత సింగ్ వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లాలోని తుపాను వలన పంటనష్టం తదితర అంశాలను సీఎస్‌కు వివరించారు. తుపాను ప్రభావానికి జిల్లాలో ప్రాథమిక అంచనాల ప్రకారం 95,970 హెక్టార్లలో వరి, 977 హెక్టార్లలో వేరుశనగ, 711 హెక్టార్లలో మినుము, 540హెక్టార్లలో మొక్కజొన్న, 250 హెక్టార్లలో పత్తి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ నెల 13వ తేదీన కేంద్ర బృందం జిల్లాలో పర్యటించి పంట నష్టాలను పరిశీలించిందన్నారు. దెబ్బతిన్న ప్రాంతాల్లో రైతులు మరలా విత్తనాలు వేసుకోవడానికి జిల్లాలో 7,954 క్వింటాళ్ల మినుము, 350 క్వింటాళ్ల వేరుశనగ, 152 క్వింటాళ్ల పెసర విత్తనాలు అవసరమని అంచనా వేశామన్నారు. మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణ పురోగతికి సంబంధించి జిల్లాలో మొదటిదశలో మంజూరైన 71 గోడౌన్ల నిర్మాణాలకు గానూ 30 గోడౌన్లు పూర్తికాగా మరో 26 డ్రయింగ్ ఫ్లాట్‌ఫాం నిర్మాణాలతో సహా పూర్తయ్యాయన్నారు. డీఆర్వో పెద్ది రోజా, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో ఎంవీ నాగేశ్వరనాయక్, డీసీవో ఫణికుమార్, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక శ్రద్ధ



గూడూరు: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. తరకటూరుపాలెం రోడ్డులోని తిరుమల రైస్ మిల్లులో ధాన్యం కొనుగోళ్లను గురువారం తహసీల్దార్ సమీక్షించారు. మిల్లు ఆపరేటర్, కస్టోడియన్ అధికారుల యాప్ మొరాయించడంతో ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బంది కలుగుతోందని రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన విజయప్రసాద్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాంకేతిక సమస్య పరిష్కారంపై చొరవ తీసుకున్నారు. దీంతో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో సహకార అధికారి విజయ్‌కుమార్, వీఆర్వో కాకుశేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

వృద్ధుడి కార్నియాల సేకరణ



బసవారావు (ఫైల్)

నాగాయలంక: స్థానిక ఒకటో వార్డుకు చెందిన ఉప్పల బసవారావు (65) బుధవారం రాత్రి మృతిచెందారు. ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఈమేరకు స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె. వెంకట నారాయణలకు సమాచారం అందించగా వారి సహకారంతో పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సుశృత బృందం మృతుడి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. సుదర్శి ఆధ్వర్యంలో నేత్రదానాల సంఖ్య 193కు చేరుకుందని రఘుశేఖర్ తెలిపారు.

పెన్షనర్ల సాయం



మచిలీపట్నంటౌన్: 36వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు కనుమూరి కోటేశ్వరరావు ఇటీవల మృతిచెందాడు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 33,300 గురువారం కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ సమక్షంలో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ దార్ల చెన్నకేశవరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు దమ్ము కేశవ, ప్రదీప్, వలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో విద్యార్థి ప్రతిభ



అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థి కొక్కిలిగడ్డ అమర్‌నాథ్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడని కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక కళాశాల ప్రాంగణంలో గురువారం అమర్‌నాథ్‌కు అభినందన కార్యక్రమం జరిగింది. కరస్పాండెంట్ మాట్లాడుతూ ఒంగోలులో నిర్వహించిన 26వ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో గ్రీన్ బెల్ట్ విభాగంలో అమర్‌నాథ్ బంగారు పతకం సాధించడం ద్వారా కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారని చెప్పారు. దేశం నలుమూలల నుంచి 400 మంది విద్యార్థులు పోటీపడగా అమర్‌నాథ్ విజేతగా నిలవడం మాకెంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, కోచ్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గురుకుల ఆంగ్ల ఉపాధ్యాయినికి పీహెచ్‌డీ



చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని చేపూరి శ్రీదేవి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉమెన్ ప్రొటాగానిస్ట్ ఇన్ ది సెలెక్ట్ షార్ట్ స్టోరీస్ ఆఫ్ మహా శ్వేతాదేవీ అండ్ వోల్గా ఏ కంపేరిటివ్ స్టడీ అంశంపై శ్రీదేవి ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి పరిశోధనాత్మక వ్యాసం సమర్పించారు. తద్వారా పట్టా అందుకున్న శ్రీదేవిని గురువారం గురుకులంలో ప్రిన్సిపాల్ పి.అరుణకుమారి అభినందించారు.

కొనసాగుతున్న పంట నష్టం నమోదు ప్రక్రియ



పెదకళ్లేపల్లిలో డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో హెబ్సిబారాణి



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏవో సాయిసింధు

వెంకటాపురం(మోపిదేవి): తుపానుకు దెబ్బతిన్న పంట నష్టం నమోదు ప్రక్రియ ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని మండల వ్యవసాయాధికారి హెబ్సిబా రాణి అన్నారు. వెంకటాపురం, పెదకళ్లేపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యోజన యాత్ర గ్రామ సభ గురువారం నిర్వహించారు. పెదకళ్లేపల్లి గ్రామ సభలో ఏఓ మాట్లాడుతూ ఈ క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకు పంట నష్టం నమోదు ప్రక్రియ ఈనెల 18వ తేదీ వరకు కొనసాగుతుందని, పంట దెబ్బతిన్న రైతులు తమ పొలం పత్రాలతో వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. పీఎం కిసాన్ యోజన కింద నగదు పడని రైతులు ఆర్‌బీకేలలో వీఏఏలను సంప్రదించాలన్నారు. పంటపై పిచికారీ చేసే మందులకు స్ప్రే చేయడానికి డ్రోన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్‌లు అందిస్తుందని, ప్రస్తుతం అద్దె రూపంలో కూడా అందుబాటులో దొరుకుతాయని చెప్పారు. ఎకరాకు మామూలుగా 15 నుంచి 20 లీటర్ల నీటిని వినియోగిస్తారని, అదే డ్రోన్‌తో 10 లీటర్ల నీటితోనే స్ప్రేయింగ్ చేయవచ్చునని వివరించారు. ఈఓపీఆర్డీ అశోక్ కుమార్, వీఏఏలు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

● **చల్లపల్లి:** మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం వివరాల సేకరణ ప్రారంభించామని ఏఓ జి.సాయిసింధు తెలిపారు. గురువారం మండల పరిధిలోని పాగోలు పరిసర గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం కలిగిన వారు తమ పేర్లు గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలని సూచించారు. సదరు రైతులు తమ ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, పాస్ బుక్ జిరాక్సులు వీఏఏలకు అందించాలని సూచించారు. ఈ నెల 18వ తేదీ లోగా జాబితా తయారు చేసి రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనగా ఉంచుతామని, డిసెంబర్ 22న అధికారులకు సమర్పిస్తామని చెప్పారు.

రక్తదానంపై అపోహలు వీడండి



కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కైకలూరు: రక్తదానంపై ప్రజలు అపోహలు వీడాలని కై కలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రఘునాథరెడ్డి చెప్పారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని కాలేజీలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం చేస్తే మరొకరి ప్రాణాలను నిలబెట్టవచ్చని తెలిపారు. కాలేజీ ఆంగ్ల అధ్యాపకుడు పంకజ్‌కుమార్ ముందుగా రక్తదానం చేయడంతో విద్యార్థులు స్ఫూర్తి పొందారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.దుర్గాప్రసాద్ నిర్వహణలో గుడివాడ గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ రక్తసేకరణ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు గీతాంజలి, ల్యాబ్ టెక్నీషియన్ షేక్ షరీఫ్, కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం.విజయ్‌కుమార్, యూత్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ ఎం.హరిప్రసాద్, రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ ఆర్.జాలబాబు, ఏలూరు హెచ్‌డీఎఫ్‌సీ మేనేజరు ఏ.సత్యనారాయణ, అధ్యాపకులు సంధ్య, ఇమ్మానియేలు, నున్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రూ.15.24 లక్షల డివిడెంట్లు పంపిణీ



డివిడెంట్లు అందిస్తున్న చైర్మన్ పాగోలు ఫణి

చల్లపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో రైతులకు ప్రతి ఏటా డివిడెంట్లు పంపిణీ చేస్తున్నామని చల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి) అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక పీఏసీఎస్ వద్ద 992 మంది రైతులకు డివిడెంట్లు పంపిణీ చేశారు. 2021–22 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన లాభం రూ.52,08,368 నుంచి రూ.7,69,457లు, 2022–23 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన లాభం రూ.52,66,321 నుంచి రూ.7,55,362లు కలిపి మొత్తం రూ.15,24,819లను డివిడెంట్లుగా పంపిణీ చేశారు. సంఘ అభివృద్ధికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు నిత్యం సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ తోట కృష్ణారావు, పర్సన్లు వేముల ఏడుకొండలు, కొలుసు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు ఆత్మహత్యాయత్నం

అవనిగడ్డ: కోడూరు మండల పరిధిలోని వి. కొత్తపాలెంకు చెందిన బాదర్ల ప్రభాకరరావు పంట దెబ్బతినడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రభాకరరావు లింగారెడ్డిపాలెం రోడ్డులో పది ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. మిచాంగ్ తుపానుకు పంట మొత్తం పడిపోయింది. గురువారం పొలం వెళ్లి చూడగా మొలకలు రావడంతో ఆందోళనకు గురయ్యాడు. గత రెండేళ్ల నుంచి ప్రభాకరరావుకు కౌలుకు సాగు చేస్తున్న పంట చేతికందే సమయంలో వర్షాల వల్ల దెబ్బతినడంతో అప్పుల పాలయ్యాడు. ఆందోళనకు చెందిన ప్రభాకరరావు గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. బంధువులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స చేశారు. ప్రభాకరరావుకు ప్రాణాప్రాయం తప్పిందని వైద్యులు తెలిపారు.

బడ్డీకొట్టు అందజేత

పమిడిముక్కల: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల పక్కన చిరు వ్యాపారాలు చేసుకొనే పేదలకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సొంత ఖర్చుతో బడ్డీకొట్లు తయారు చేయించి అందజేస్తున్నారు. దీనిలో భాగంగా కృష్ణాపురం శివారు ఎస్సీ కాలనీకి చెందిన జె.వెంకటరత్నంకు బడ్డీకొట్టును అందజేశారు. దీన్ని గురువారం మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్ ప్రారంభించారు. వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, మహేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

గన్నవరం: ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎంపీపీ అనగాని రవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి దాసరి మాన్యను ఎంపీపీ అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయనగరంలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మాన్య పసిడి పతకం సాధించడం ప్రశంసనీయమన్నారు. జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

భవిత కేంద్రం తనిఖీ



గూడూరు: గూడూరులోని భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష ఏపీసీ కె.రాములు నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రిజిస్టర్లను పరిశీలించి ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 47 ఐఈఆర్పీలను నూతనంగా నియమించామని చెప్పారు. ఒక్కో ఐఈఆర్పీ 20 మంది చిన్నారులకు తక్కువ కాకుండా పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ కె.ఏడుకొండలు, ఐఈఆర్పీ రమాదేవి పాల్గొన్నారు.

వృద్ధులు, వితంతువులకు వస్త్రదానం



పురిటిగడ్డ(చల్లపల్లి): క్రిస్మస్ పండుగ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక సీఎస్ఐ చర్చిలో 54 మంది నిరుపేద వృద్ధులు, వితంతువులకు ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆధ్వర్యంలో రూ.30 వేలతో నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యాచకురాలి మృతి



బంటుమిల్లి: అర్తమూరు గ్రామం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై బందరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న యాచకురాలు గురువారం మృతి చెందిందని ఎస్ఐ ఎ. పైడిబాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వృద్ధ మహిళ అర్తమూరు పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ రాత్రి 216 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొంది. గాయపడిన ఆమెను స్థానికులు 108 వాహనంలో బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మృతి చెందింది. ఆమె వివరాలు తెలియలేదు. వీఆర్ఓ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మురళీకృష్ణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు సెల్: 94407 96419కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

మానవ అక్రమ రవాణా నియంత్రణపై అవగాహన

పామర్రు: మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్నామని ప్రజ్వల సంస్థ సీనియర్ కో ఆర్డినేటర్ వై.చంద్రయ్య చెప్పారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, పామర్రు అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ అధికారుల సహకారంతో ఇప్పటి వరకు 28వేల మంది అమ్మాయిలను మహిళను కాపాడి వారికి పునరావాసం కల్పించామన్నారు. నేటి యువత ఇంటర్నెట్, మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్‌కి గురి అవుతున్నారన్నారు. వారిని గమనిస్తూ అన్ని జిల్లాలలో అంగన్‌వాడీ టీచర్‌లకు అవగాహన కల్పిస్తూ సమాజ జాగృతిసంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు శ్రావ్య, అనిల్ కుమార్, ఆర్.కల్యాణ్ చక్రవర్తి, కె. రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

శివారు గ్రామాల్లోనూ రహదారుల అభివృద్ధికి కృషి

పేర్ని కిట్టు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: మారుమూల గ్రామాల్లో సైతం రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. బందరు మండలం మేకవానిపాలెం పంచాయతీ శివారు రెండో నంబరు మైలు రాయి నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రోడ్డు మీదుగా గడప గడపకు మన ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 5.50 లక్షల నిధులతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు గురువారం కిట్టు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రూపకల్పన చేశారని చెప్పారు. ప్రజాప్రతినిధులు గడప గడపను సందర్శించి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ చేతల ప్రభుత్వమే తప్ప మాటల ప్రభుత్వం కాదని సీఎం జగనన్న నిరూపిస్తున్నారన్నారు. అటువంటి ముఖ్యమంత్రి మనకు లభించటం మనమంతా చేసుకున్న అదృష్టమన్నారు. అనంతరం మంగినపూడిలో మరో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కిట్టు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మేకవానిపాలెం మాజీ సర్పంచ్ మేకా లవకుమార్, మంగినపూడి మాజీ సర్పంచ్ కూనపురెడ్డి వీరాస్వామి, కో- ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, ఆయా గ్రామాల పెద్దలు, నాయకులు, పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



లేళ్లగరువులో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

గూడూరు: ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లపై అవగాహన కలిగి ఉండాలని గూడూరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నస్రీన్ ఆరా అన్నారు. ఓటర్లను చైతన్యపరచడం, భాగస్వామ్యం చేయడం (స్వీప్)లో భాగంగా గూడూరు మండలంలోని నాగవరం, గండ్రం, షా అబ్దుల్లాపాలెం, లేళ్లగరువు, కంకటావ, రామానుజవత్తర్లపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈవీఎంలను ప్రదర్శించి, అవి పనిచేసే విధానాన్ని ఓటర్లకు వివరించారు. ఈవీఎంలో ఉండే బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లు ఏ విధంగా ఓటు వేయడానికి ఉపకరిస్తాయి తదితర అంశాలను వివరించారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు చిలుకోటి దినకర్, వరప్రసాద్, వీఆర్వోలు బషీర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న శేషగిరిరావు

గూడూరు: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆటల పోటీలకు గూడూరు మండల అధికారులు సమీక్ష నిర్వహించారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం నుంచి ఆటల పోటీలు ప్రారంభం కావాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఈఓపీఆర్డీ పి.రాజేశ్వరి, మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి మత్తి అరుణ తదితరులు ఆడుదాం ఆంధ్రా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ, తహసీల్దార్ క్రికెట్, వాలీబాల్ ఆడుతూ క్రీడాకారులను ఉత్సాహ పరిచారు.

అవగాహన సదస్సు..

నాగాయలంక: గ్రామాల్లోని యువత ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయడంలో అధికారులు, క్రీడాకారులు కీలకపాత్ర వహించాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు అన్నారు. నాగాయలంక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. శేషగిరి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా క్రీడలు ఈనెల 26 నుంచి ప్రారంభమవుతాయని, సచివాలయం, మండలం, నియోజకవర్గం స్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రీడా పోటీలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించేందుకు అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులను ఆయా పాఠశాలలకు కేటాయిస్తూ ఇన్‌చార్జీలుగా నియమించామని చెప్పారు. తహసీల్దార్ జె.విమలకుమారి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (పీఆర్) జేకే సీతారామ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు సీహెచ్ సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు, పీఎస్ గ్రూప్ డీడీఓలు, సచివాలయం గ్రేడ్ 5, గ్రేడ్ 4 వలంటీర్లు సదస్సుకు హాజరయ్యారు.

ప్రారంభానికి ముస్తాబవుతున్న కైకాల విగ్రహం

గుడివాడ టౌన్: సినీ నటుడు, బందరు మాజీ ఎంపీ కై కాల సత్యనారాయణ కాంస్య విగ్రహం ప్రారంభానికి ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే విగ్రహాన్ని ఏర్పాటు చేసి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈనెల 23న బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నారు. కళాకారుల పుట్టినిల్లు అయిన పట్టణానికి చెందిన కై కాల విగ్రహాన్ని ఏర్పాటు చెయ్యడంపై కళాకారుల సంఘాలు, కాపు నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

తోట్లవల్లూరు: ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం జోనల్ సూపర్ వైజర్ సుందరరావు సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యాన మండలంలోని రొయ్యూరు గ్రామ సచివాలయంలో గురువారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన జరిగింది. వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.